# నాటకమే జీవితం



—పల్లేటి బాలాజీ

"జీవితం నాటక మవుతుంది. కానీ ఒక్కోసారి నాటకమే జీవిత మవుతుంది!" అన్నమాటలు ఎవరు ఎప్పుడు నాకు చెప్పారో గుర్తుకు రావడం లేదు. కానీ ఎందుకో యిప్పుడే యిక్కడ నుంచి వెళ్తున్న నా మిత్రుడు కిషోర్‌ని చూశాక నాకు పై మాటలు గుర్తొచ్చాయి. వెంటనే నాకు కిషోర్ గతం కూడా గుర్తొచ్చింది. కిషోర్ నాకు డిగ్రీ ఫస్టియర్ నుంచి మంచి మిత్రుడు. నేనూ కిషోర్ ఇద్దరం డిగ్రీ పూర్తి చేసిన వెంటనే హైదరాబాద్ సెక్రటేరియెట్‌లో ఒకే సెక్షన్‌లో ఎల్‌డిసిలుగా చేరాం!

ప్రస్తుతానికి యిద్దరం బాచిలర్సమే కాబట్టి హిమాయత్‌నగర్‌లో చిన్న పోర్షన్ అద్దెకు తీసుకుని వుండసాగాం.

"మన సెక్షన్‌లో కొత్తగా చేరిన రమణి మీద నీ అభిప్రాయం ఏమిటిరా?" వున్నట్లుండీ నన్ను ప్రశ్నించాడోరోజు కిషోర్.

వెంటనే నాకేం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. అందుకనే...

"ఆమెను గూర్చి నా అభిప్రాయం తెలుసుకోవాల్సిన అవసరం నీకేమొచ్చిందిరా?" అని ఎదురు ప్రశ్న వేశాను.

"అవసరం వుంది కాబట్టే అడుగుతున్నాను."

"అంటే?"

"నేనామెను ప్రేమిస్తున్నాను. ఆమె లేని జీవితం లేదు అని గట్టిగా అనుకుంటున్నాను" ఎంతో స్థిరంగా చెప్పాడు.

ఈ సమాధానం నేను వాడి నోటి నుండి ఊహించలేదు.

"కిషోర్! ఆమె మన సెక్షన్‌లో చేరి కనీసం పదిరోజులు కూడా కాలేదు కదరా?" అన్నాను.

"అయినా ఆమె పదేళ్ళ బ్యాక్ హిస్టరీ తెలుసుకున్నాను. గతంలో ఆమె ఎవ్వరినీ ప్రేమించలేదు. ఆస్తి పెద్దగా లేదు. కానీ అందం వుంది. ఆఫీసులో తలెత్తి పక్కవాడివంక కూడా చూడదు. సంసారానికి చాలా అనువైన వ్యక్తిత్వం అని నా నమ్మకం..." అని ఆమెను గూర్చి చాలా చెప్పాడు.

"ఆమెను గూర్చి చాలా తెలుసుకున్నావు గానీ ఆమె నిన్ను ప్రేమిస్తోందా?" అనుమానంగా ప్రశ్నించాను.

"ఆ విషయం ప్రస్తుతం తెలుసుకునే ప్రయత్నంలో వున్నాను. అందులో భాగంగానే ఈ రోజు ఆమెకో చిన్న ప్రేమ లేఖ రాశాను కూడా!" సిగ్గుపడుతూ చెప్పాడు.

"వెరీ గుడ్! విష్ యూ ఆల్ ది సక్సెస్" అని అభినందించాను మనసారా.

* * *

వారం రోజులకు మా కిషోర్ ప్రేమ ఫలించినట్లుంది. రమణితో కలసి కామత్ హోటల్‌కి వెళ్ళి టిఫిన్ లాగించి వచ్చి నాతో చెప్పాడు.

"వెరీ గుడ్! మీ యిద్దరి ఈడూ జోడు... ఒకే సెక్షన్‌లో ఉద్యోగం...అదృష్టవంతుడివిరా!" అన్నాను.

నా మాటలు విని మరీ సంతోషిస్తున్నట్టున్నాడు.

"ఈ రోజు సాయంత్రం లేట్‌గా రూమ్‌కి వస్తాను" అని నవ్వుతూ వెళ్ళిపోయాడు కిషోర్. రోజులు గడుస్తున్న కొద్దీ రమణీ కిషోర్‌ల ప్రేమ గట్టిపడ సాగింది. ప్రతి రోజూ షికార్లకో షాపింగ్‌కో, సినిమాకో వెళ్ళసాగారు.

"పెళ్ళికి ముందే ఈ తిరుగుళ్ళు ఏమిటిరా? హాపీగా పెళ్ళిచేసుకుని ఎంజాయ్ చెయ్యొచ్చుగా?" అని కిషోర్‌ని ప్రశ్నించానోరోజు.

"పెళ్ళయిన తర్వాత తిరగలేం బ్రదర్. అందుకనే అనుభవించాల్సిందంతా ఇప్పుడే జతగా అనుభవించాలి. అన్నట్టు మర్చిపోయాను. యివి పోయిన వారం మేం సాగర్ వెళ్ళినప్పుడు తీయించుకున్న ఫోటోలు చూడు" అని మాక్సీ సైజు కలర్ ఫోటోలు నాకిచ్చాడు. అవి చూసిన నేను...

"హనీమూన్ వెళ్ళిన జంట తీయించుకున్నట్లు వున్నాయి" అన్న కామెంట్ విసిరాను కిషోర్ మీద.

నవ్వుకుని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కథ చాలా నాటకీయంగా జరిగింది. మా బాస్ ఆమెకి దూరపు బంధువట- ఆ విషయం మా వాడికి చాలా ఆలస్యంగా తెలిసింది-ఈ ప్రేమాయణం ఆయనగారి దృష్టికి వచ్చి ఇద్దర్నీ నిలదీసేసరికి "మేం పెళ్ళి చేసుకోబోతున్నాం"అని ఆమె అనడం, ఆ సమయానికి మావాడూ "అవున"నడం జరిగిపోయాయి. దానిని ఆసరాగా చేసుకుని మా బాస్ సెక్షన్లో పెద్ద పార్టీ ఇచ్చి పెళ్ళి విషయం డిక్లేర్ చేశాడు.

"వెడ్డింగ్ కార్డ్స్ ఆర్డర్ యివ్వడానికి ఎందుకురా ఆ ఏడుపుముఖం?" అని ప్రశ్నించాను.

ఇంతకు ముందు రూంలోంచి వెళ్ళబోయే ముందు చెప్పిన సమాధానమే చెప్పాడు. నాకు కోపం వచ్చింది.

"పెళ్ళి చేసుకోవడానికి కాకపోతే ఎందుకు ప్రేమించావురా రమణిని?" అని కోపంగా ప్రశ్నించాను.

"ఏదో ఒకే సెక్షన్‌లో వుంది. అందంగా వుంది. సరదాగా గడుపుదాం జతగా తిరుగుదాం అనుకున్నాను. అంతేకానీ యిలా పెళ్ళిపేరుతో జీవితాంతం యిద్దరం ఒకటవుతామని కల్లో కూడా నేను ఊహించలేదు గాక ఊహించలేదు" అని వెంతో నిర్మోహమాటంగా చెప్పిన కిషోర్‌వంక ఎంతో ఆశ్చర్యంగా చూసి...

"పదరా వెళ్ళి వెడ్డింగ్ కార్డ్స్‌కి ఆర్డరిచ్చి వద్దాం!" అని పైకి లేచాను.

దార్లో మౌనంగా ఏదో పోగొట్టుకున్న వాడిలా నడుస్తున్నాడు కిషోర్. వాడ్ని చూస్తే ఓ పక్క కోపం, ఓ పక్క జాలి కల్గింది నాకు. వాడ్ని కొద్దిగానైనా ఓదార్చుదామని-

"కిషోర్! మనసారా కోరుకున్నవార్ని పెళ్ళి చేసుకునే అదృష్టం అందరికీ రాదు. అలాంటిది నువ్వు మనసారా కోరుకున్న నీ ప్రియురాలితో పెళ్ళికాబోతున్నందుకు ఎందుకురా బాధపడతావ్?" అన్నాను. "నేను రమణిని మనసారా కోరుకున్నట్టు నటించానురా. నిజంగా నేనామెను మనసారా కోరుకోలేదు" అన్నాడు కిషోర్.

"ఏం చేద్దాం ఒక్కోసారి నాటకమే జీవిత మవుతుంది" అంటూ కిషోర్ వెంట నడవసాగాను. ■